Qurbe Ilahi ke Chand Aasan Amali Tareeqey
(Telugu)

దైవ సాన్నిధ్యం కోసం ఏం చేయాలి?

రచన

ఖుర్రం మురాద్

తెలుగు రూపం

ఎస్.ఎ. ఆదిల్

విషయ సూచిక

సర్వసృష్టికర్త అయిన అల్లాహ్ పేరుతో

దైవ సామీప్యం - ప్రాముఖ్యత

దైవం పట్ల ప్రేమ, దైవాభిమానం, దైవసాన్నిధ్యాన్ని మించి మనకు జీవితంలో ఇంకా ఏం కావాలి? దీని స్థానం ఎంతో ఉన్నతమైనది. దీని భాగ్యమూ మరెంతో విలువైనది. కాని ఈ ప్రేమా సామీప్యాలను కాంక్షించడం, దాని కోసం ప్రయత్నించడం ప్రతి ముస్లింకు ఏదో ఒక స్థాయిలో ఎంతయినా అవసరం. ప్రభువు ఇలా సెలవిచ్చాడు: **"విశ్వాసులు అందరికంటే ఎక్కువగా అల్లాహ్‌ను ప్రేమిస్తారు"** (అల్ బఖర) ఇంకా **"సజ్దా చెయ్యి. నీ ప్రభువుకు చేరువయిపో"** (అలఖ్-96:19)

దైవసామీప్యత ప్రతి ఒక్కరికీ తప్పనిసరి, అయినప్పుడు దాన్ని పొందగలగడం ప్రతి ఒక్కరి వశంలో ఉండాలి. ధర్మం సులభమయినదైనప్పుడు దాన్నిపొందే మార్గం కూడా సులభమయినదై ఉండడం అవసరం. దాన్ని పొందగలిగే సులభమార్గం ఏది? దైవప్రవక్త (సఅసం) మార్గానుసరణ, ఆయన చేసిందీ, ఏ స్థాయిలో చేశారో, ఏ విధంగా చేశారో, దానిని అదే స్థాయిలో, అదే విధంగా చేసి, మన జీవితాన్ని ఆయన (సఅసం) జీవితంలాగా మలచే ప్రయత్నం చేస్తూ వుండాలి- ఇదే దైవ సాన్నిధ్యాన్ని పొందే సులభమార్గం! **"ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు: మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమవుంటే, నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు."** (ఆలి ఇమ్రాన్-31)

దైవదాసులకు అల్లాహ్ సందేశం అందించడం, వారిని అల్లాహ్ వైపునకు ఆహ్వానించడం, మానవాళిని అల్లాహ్ వైపునకు మరియు ఆయన మార్గంలో కృషి చేయడానికి పిలవడం, సమీకరించడం ఇంకా వారిని తన వెంట నడిపించడం- ఇదే దైవప్రవక్త (సఅసం) మార్గం. ఇది దైవసాన్నిధ్యాన్ని పొందే ఖచ్చితమయిన మార్గం. ఈ పనిని విడిచి పెట్టకూడదు. దీనిని వాయిదా వేయడంగానీ, దీనిపట్ల ఏమరుపాటు వహించడంగాని చేయకూడదు. ఈ పనిని

సరైన రీతిలో నిర్వర్తించడానికి ప్రవక్త మార్గంలో నడిచేవాడు సాటి ప్రాణుల పట్ల శ్రద్ధ, ఇంకా వారితో కలసి పని చేయడంలో, తన స్వయం వైపు శ్రద్ధ వహించడం, ఈ పని కోసం ప్రయాణ సామగ్రిని సమీకరించుకోవడం పట్ల ఏమరుపాటు వహించకూడదు. ఇంకా ఇతరుల్ని పిలవటంతోపాటు తన స్వయాన్ని కూడ పిలవటం, దానిని తన వెంట నడిపించడం మరువకూడదు. ఎందుకంటే జనసామాన్యానికి మార్గోపదేశం చెయ్యడం అనేది గొప్ప బాధ్యతతో కూడిన పని. ఇదొక ముళ్ళబాట. ఈ హితబోధను కఠిన పదంగా, ఈ పనిని నడ్డి విరిచే బరువుగా చెప్పడం జరిగింది. **"విజ్‌రకల్లజీ అన్‌ఖజ జహ్‌రక్."**
(అలమ్ నష్‌రహ్–94 : 2–3)

దైవదౌత్య కార్యాన్ని సక్రమంగా నిర్వర్తించడానికి ఈ ప్రయాణ సామగ్రి ఏమయి ఉంటుంది? అన్నింటినీ మించి, ఏదయితే లేకుండా ఈ పని అసలే జరుగదో, అది అన్నింటితో సంబంధం తెగతెంపులు చేసుకొని కేవలం అల్లాహ్‌కు అంకితుడై ఉండటం (ఏకాగ్రచిత్తుడు), ఇంకా ప్రతి పనీ కేవలం అల్లాహ్ కోసమే చెయ్యటం (చిత్తశుద్ధి)– ఏ స్థాయిలో, సాధ్యమయినంత మేరకు– ఇందు కోసం మనం చిత్తశుద్ధి ఏకాగ్రతల అత్యున్నత స్థాయిని ఆశించడం– లక్ష్యంగా చేసుకోవడం అవసరం. ఇంకా దైవప్రవక్త (స) పద్ధతిలో సందేశ కార్యంతో పాటు, ఆ స్థాయిని పొందటానికి సాధనం కాగల ఆచరణల ఏర్పాటు కూడ చేసుకోవాలి.

చూడండి! **"వమా ఉమిరూ ఇల్లా లియాబుదుల్లాహ ముఖ్‌లిసీన లహుద్దీన హునఫాఅ" (వారు అల్లాహ్‌కు దాస్యం చెయ్యాలని పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని తప్ప వారికి మరే ఆజ్ఞా ఇవ్వబడలేదు).** (అల్ బయ్యినహ్–98:5) అని ధర్మం యొక్క వివరణ ఇవ్వ బడినప్పుడు దానిప్రక్కనే అప్పగింతగా నమాజ్ మరియు జకాత్‌ల ఉపదేశం కూడా చెయ్యబడింది. చివరగా దైవభీతి గురించి కూడా. మొదటి వహీలోనే మానవులకు దైవసందేశం అందజేయమని ఉపదేశించబడింది. **"చదువు, సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు నామంతో" (అలఖ్)**– అంటూ దాని ప్రక్కనే **"సజ్దా చెయ్యి, (నీ ప్రభువు) సాన్నిధ్యం పొందు"**– అన్న ఉపదేశం కూడా చేర్చబడింది. తొట్టతొలిగా **"లే, లేచి హెచ్చరించు"** అన్న వహీ వచ్చినప్పుడు దాని వెంటనే,

"రాత్రివేళ నమాజులో నిలబడుతూ వుండు.... ఇంకా ఖుర్ఆన్‌ను నెమ్మదిగా ఆగి ఆగి పఠించు... నీ ప్రభువు నామ స్మరణ చెయ్యి మరియు అన్నింటినీ వదలి పూర్తిగా ఆయనకే అంకితం అయిపో" అన్న వహీ కూడా వచ్చింది. (అల్ ముద్దస్సిర్, అల్ ముజ్జమ్మిల్). **"నీ ప్రభువు వరాలను బహిర్గతం చెయ్యి"**- అని అన్నప్పుడు, దానితోపాటే **"నీకు తీరిక లభించినప్పుడు కఠోరమైన ఆరాధనలో నిమగ్నుడవైపో, నీ ప్రభువు మీదనే నీ మనసును లగ్నం చెయ్యి"** అని కూడ చెప్పబడింది. (అజ్జుహా, అలమ్ నష్రహ్). **"అల్లాహ్ మార్గంలో జిహాద్ చెయ్యండి. జిహాద్ చేయవలసిన విధంగా"** అని ఆదేశించినప్పుడు వెంటనే, **"ఇక నమాజ్ స్థాపించండి, జకాత్ చెల్లించండి, అల్లాహ్‌తో గట్టి సంబంధం కలిగి వుండండి."** అన్న అర్థవంతమయిన ఆధ్యాత్మిక సామగ్రిని గురించి కూడ వివరించాడు (అల్‌హజ్). కార్యసిద్ధి, విజయాలను **"యద్ఖులూన ఫీ దీనిల్లాహి అఫ్వాజా"** (ప్రజలు తండోపతండాలుగా దైవధర్మంలోకి మరలి వస్తారన్న శుభవార్త వినిపించడంతోపాటు- నీ ప్రభువును విరివిగా స్తోత్రం చెయ్యి. ప్రజా వెల్లువతో పాటు తడబాట్లకూ ఆస్కారం ఎక్కువ. కనుక అందుకోసం **"ఇస్తిగ్ఫార్- (మన్నింపు కోసం దుఆ)ను విధిగా చేసుకో"** అని గట్టి తాకీదు చేశాడు.

సందేశం, ధర్మపోరాట మార్గాలన్నీ, ఈ ప్రయాణ సామగ్రి వెంట లేకుండా దాటలేము. దీన్ని అల్లాహ్ ఎంతో తాకీదుతో వివరించాడు. దైవప్రవక్త (సఅసం) అనునిత్యం సందేశం, ధర్మపోరాటంలో నిమగ్నులయి వుండేవారు. ఆయన (స)కు వీలయినంత ఎక్కువ మంది - అందరూ ఆయన అనుచరులు అయిపోవాలన్న తపన ప్రతిక్షణం వెన్నంటి వుండేది. ప్రజలు ఆయనకు సహకరించడానికి నిరాకరించినప్పుడు ఆయన (స) వారిపట్ల విచారంతో క్రుంగిపోయేవారు. అన్ని రకాల మనుషులు ఆయన చుట్టూ చేరేవారు. ఆయన (స) వ్యవహారాలు, పరిపాలన, సంధి, యుద్ధం, శిక్షణ, ప్రక్షాళన, న్యాయపాలన, తీర్పులు, ప్రజా సంబంధాలు వంటి పనులలో కూడ పూర్తిగా నిమగ్నులయి వుండేవారు. కాని దానితోపాటు ఆయన రాత్రులు నమాజ్‌లో నిలబడేవారు. ఒకే బైఠాయింపులో వందేసిసార్లు 'ఇస్తిగ్ఫార్' చేసుకునేవారు. ఎల్లప్పుడూ దైవధ్యానంలో లీనమై ఉండేవారు. పూర్తి ఏకాగ్రతతో మనసు లగ్నం చేసుకుని

అల్లాహ్ వైపునకు సావధానులయి వుండేవారు. ఆయన (స) లాగా ఎవరూ కాలేరు. కాని అల్లాహ్ ఆయన (స)పై, ఆయన (స) ద్వారా ముస్లిం సమాజానికి అప్పగించబడిన సందేశం, జిహాద్‌ల కార్యక్రమాన్నే ఏదో ఒక స్థాయిలో ఎవరైనా నిర్వర్తించదలిస్తే అతడు కూడా ఆయన (సఅసం) వలెనే పైన తెల్పిన దైవాదేశాలను పాటించవలసి వుంటుంది. పైగా అతడు సర్వకాలాలలో ఖుర్‌ఆన్ బోధనల్ని, ఆయన (సఅసం) ఆదర్శాన్ని అనుసరించే ప్రయత్నంలో నిమగ్నుడు కావాలి. అవి లేకుండా అతడు ఈ ప్రమాద భరిత మార్గంపై సరయిన విధంగా నడవనూ లేడు, స్థిరపడనూ లేడు.

ప్రతి మనిషి తన స్తోమతకు తగ్గట్టుగానే కృషి చేయగలుగుతాడు. కృషి చేసినంత మేరకే దైవికమయిన సద్బుద్ధిని, సామీప్యతను పొందగలుగుతాడు. కానీ దేవునిపై శ్రద్ధాసక్తులు, దైవసాన్నిధ్యపు స్థానాల కోసం చేయవలసిన కర్మలు, కేవలం ప్రత్యేక వ్యక్తుల వల్లనే సాధ్యపడగల కష్టతర కార్యాలు అని, ఈ స్థానాలు కేవలం అటువంటి వారికే దక్కుతాయని భావించడం సమంజసం కాదు. ఇందులోని ప్రతి ఆచరణ ఏదో ఒక స్థాయిలో ఒక సామాన్య మానవుడికి అసాధ్యమయిన లేక కష్టమయిన విధంగా లేదు. స్వర్గం, మరియు దైవసాన్నిధ్య మార్గాన్ని **"యుస్‌రా"** (సులభం) అనడం జరిగింది. ఇంకా **"ధర్మం సరళమయినది"** అన్న శుభవార్త కూడా ఇవ్వబడింది.

దైవసాన్నిధ్యం కోసం అన్వేషణ, ఆయా పనులను చేయడం లేక చేయడానికి ప్రయత్నిస్తూ వుండటం ప్రతిక్షణం చేయవలసిన పని. కాని వీటిని పొందటం మామూలు కన్నా సులభం. మరల కొన్ని క్షణాలు వుంటాయి. ఇంకా వాటి ఫలితాలు కూడ అనేక రెట్లు ఎక్కువ కావచ్చు. ప్రతి పగలూ, ప్రతి రేయీ ఇలాంటి క్షణాలు ఎన్నో వస్తుంటాయి. రాత్రి ఘడియలు ప్రత్యేకించి ఇటువంటి ఘడియలే. అదే విధంగా మాసాలు, సంవత్సరాల కాలభ్రమణంలో పవిత్ర రమజాన్ మాసం కూడ ఇటువంటి సమయమే. ప్రతి రాత్రీ ఒక ప్రత్యేక ఘడియ వుంటుంది. ఆ ఘడియలో అల్లాహ్ దిగ్మండలానికి దిగి వస్తాడు. తన

ఉదార హస్తాలను చాపుతాడు అన్న విషయం రాత్రి ఘడియల విలువా గౌరవాల్ని ఫలప్రదాయతను చాటుతోంది. ఇంకా రమజాన్ మాసంలో షైతానులు బంధించబడటం, స్వర్గ ద్వారాలు తెరచి వేయబడటం, ఫర్జ్‌కు డెబ్బయి రెట్లు, నఫిల్‌కు ఫర్జ్‌తో సమానంగా ప్రతిఫలం లభించడం అనే విషయాలు, రమజాన్ మాసపు విలువా గౌరవాలను స్పష్టం చెయ్యడానికి చాలు. రాత్రి, ప్రతి రోజూ వస్తుంది. రమజాన్ ప్రతి సంవత్సరమూ వస్తుంది. ఈ విలువయిన సమయాల ద్వారా పొందగలిగినంత ఎక్కువ ప్రయోజనం పొందండి. రమజాన్ మాసం లభిస్తే ఇంకా చెప్పవలసినదేముంది? కాని ఎప్పటికయినా అంతం అయిపోయే జీవితంలో ఏ క్షణం లభించినా, ఆ క్షణం నుండే సామాన్య ప్రజల్ని మేలు వైపునకు పిలిచే, మేలు కోసం సమీకరించే ప్రమాద భూయిష్టమయిన మార్గం కోసం తప్పనిసరి అయిన కర్మలు నిర్వర్తించేందుకు దీక్ష పూనండి. నిర్వర్తించడమూ ఆరంభించండి.

మీరు ముస్లిములే అయితే ఈ మార్గాన్ని విడనాడలేరు. ఎందుకంటే ఇది దైవప్రవక్త (స) మార్గం కనుక. మేలు వైపు స్వయంగా నడవడమూ విధియే. మానవులను మేలు వైపునకు ఆహ్వానించడమూ విధిగా చేయవలసిందే. దైవసాన్నిధ్యం కోసం వివిధ కర్మలు ఆచరిస్తూనే ఈ లక్ష్యం (మేలు వైపునకు పిలవటం) కోసం నడుంబిగించాలి.

ఒక మౌలిక విషయాన్ని కూడ గుర్తుపెట్టుకోండి. ఈ పనులలో ఏ ఒక్కటి కూడా చేయడానికి జీవితంలోని దినసరి వ్యవహారాలను విడిచిపెట్టవలసి రావడంగానీ లేక అందులో అంతరాయం కలగడంగానీ, అత్యంత బిజీ జీవితంలో అందుకు ఆస్కారమే లేకపోయే పనిగానీ లేవు, అసలు విషయం శ్రద్ధ, అసలు చిట్కా రోజువారీ కార్యకలాపాలను దైవసాన్నిధ్యాన్ని పొందే సాధనంగా మలచు కోవటమే దీని అసలు కిటుకు. అదనంగా చేయవలసిన పనులు చాలా తక్కువ. వాటికి పట్టే సమయమూ తక్కువే. కష్టంతో కూడుకున్న పనులు సమయాన్ని కోరే పనులు ఉదాహరణకు రాత్రి పూట నఫిల్ నమాజులకై ఉపక్రమించటం లాంటి పనులు సులభతరం చేసుకునే మార్గాలు కూడా తెలుపబడ్డాయి.

సులభమయిన ఆచరణా పద్ధతులు

1. నమాజ్‌లో ఖుషూ (అణకువ) కోసం

మనమందరం ప్రతి రోజూ ఐదు పూటలు నమాజ్ చేస్తూ ఉంటాము. కాని ప్రతి రోజూ ఐదు పర్యాయాలు ఈ సెలయేరు (నమాజ్)లో ఆధ్యాత్మిక స్నానం చేసినప్పటికీ మనలో ఉన్న ఆధ్యాత్మిక, నైతిక రుగ్మతలు స్నానానికి ముందు ఉన్నవి ఉన్నట్లుగానే వుండిపోతున్నాయి. ఇంకా అల్లాహ్‌తో సంభాషించి, కలుసుకుని, ఆయన ఎదుట మన లేమినీ, నిస్సహాయతనూ, కృతజ్ఞత, ప్రేమ, దీనత్వం, అవమానాలను ప్రకటించుకున్నప్పటికీ దానివల్ల మనకు ఏమాత్రం ఆయన సాన్నిధ్యం లభించడం లేదు. ఇంతకన్నా దురదృష్టం మరేముంటుంది? వాస్తవానికి నమాజే ఒక సాన్నిధ్యం. దైవసాన్నిధ్యాన్ని పొందడానికి ఖచ్చిత మయిన ఔషధం. అందుకోసమే సందేశం, ధర్మపోరాటానికి సంబంధించిన ప్రతి ఉత్తర్వుతో పాటు ప్రతిరోజూ ఐదుపూటలు నమాజ్‌ను స్థాపించమన్న ఆదేశం కూడా ఇవ్వబడింది.

ఈ పరిస్థితిని మార్చడం ఎంతయినా అవసరం. ఇందుకు శ్రమ కూడా కలుగు తోంది, సమయమూ ఖర్చవుతోంది. అటువంటప్పుడు ప్రయోజనము ఎందుకు ఉండదు? ఈ ప్రయోజనం కోసం నమాజ్ స్థాపన యొక్క బాహ్య పరమయిన షరతులు- సరయిన వేళ, క్రమపద్ధతి మరియు జమాఅత్- వీటి పాటింపుతో పాటు పూర్తిగా మీ అధీనంలోనే వున్న, ప్రతి నమాజ్‌లో ఖుషూ (అణకువ)ను పొందే ప్రయత్నం కూడ చేయండి. ఇంతకన్నా ఎక్కువగా ఏమీ చేయనవసరం లేదు. అంటే నమాజ్‌ను ఒక నిర్జీవ ఆచారంగా కాక తమ ప్రభువుతో సమావేశం, సంభాషణగా మలచే ప్రయత్నం చేయాలి. ఈ ప్రయత్నం కూడా మన వశంలోనే వుంది. ఇందుకోసం దీనికి సమయమూ శ్రమా అవసరం లేదు. సుదీర్ఘ నమాజు, అదనపు ఆచరణల అవసరం ఎంత మాత్రమూ లేదు. కేవలం శ్రద్ధ అవసరం. ఆ శ్రద్ధ కూడా మనోభావాలు దారి తప్పకుండా, మనస్సును కుశంకల నుండి కాపాడుకోవటానికి వెచ్చించనవసరం లేదు. కాకపోతే ఒకటి లేక అంతకు మించి ఈ క్రింది విషయాలపై శ్రద్ధను కేంద్రీకరించడంతో కూడా సరిపోతుంది.

1) నోటితో పలికే ప్రతి పదం, ప్రతి వచనాన్ని, దాని అర్థంతో పాటు మనసులో మననం చేసుకోవాలి.

2) అల్లాహ్ నా ఎదుట వున్నాడు. నేను పలికే దాన్నీ, చేసే దాన్నీ ఆయన వింటున్నాడు, చూస్తున్నాడు.

3) నా దాస్యం, నా దేహ స్థితినీ అల్లాహ్ చూస్తున్నాడని, ఈ దేహస్థితిపై దృష్టినీ భావననూ కేంద్రీకరించాలి.

4) నేను అల్లాహ్‌తో కలవడమూ, సంభాషించడమూ చేస్తున్నాను.

5) ఇదే నా ఆఖరి నమాజు కావచ్చు.

6) నా ఈ నమాజ్ ప్రళయ దినం నాడు దైవ సమక్షంలో సమర్పించ బడుతుంది. ఇది అంగీకరించబడకపోయే ఏ పనినీ నేను నా ఇష్టపూర్వకముగా చేయను. తన ప్రభువును కలుసుకోవాల్సి వుందనీ ఇంకా ఆయన వద్దకే మరల వలసి వుందన్న తహతహ మనస్సును వెన్నంటి వుండాలి. ఖుషూ స్థితిని పొందడానికి దివ్యఖుర్‌ఆన్ చూపిన పద్ధతి ఇదే.

ఇక తర్వాత రాబోయే నమాజ్ నుండే మీరు ఖుషూ జనింపచేసు కోవడానికి ఈ ఉపాయాలను అవలంబించడం ఆరంభించండి. వాటిని క్రమం తప్పక ఆచరిస్తూ వుండండి. ఇలా చేస్తే ఇన్షాఅల్లాహ్ నమాజ్ ద్వారా మీకు కావలసిన ప్రయాణ సామగ్రి లభించడం ఆరంభమైపోతుంది.

2. ఖియామె లైల్ (రాత్రి నమాజ్‌లో నిలబడటం)

రాత్రి నమాజ్ (తహజ్జుద్) ఫర్జ్ (విధి)గా అయితే చేయబడలేదు. ఎందుకంటే సాధారణ వ్యక్తి అనారోగ్యం, ఉపాధి సంపాదన, ధర్మపోరాటాల వంటి పనుల కారణంగా దానిని పాటించలేకపోతాడు. కాని ఇలా చేయాలన్న తాకీదు, ప్రోత్సాహంలో ఏమీ లోటు చేయబడలేదు. అల్లాహ్ తన ప్రియతమ దాసుల గుణగణాలలో ఖియామె లైల్ గురించి పలుమార్లు ప్రస్తావించాడు. **"వారు సజ్దాలలో, దైవ సమక్షంలో నిలబడటంలో రాత్రుల్ని గడుపుతారు."**

(అల్ పుర్ఖాన్, అజ్‌జుమర్)

"వారు రాత్రులలో బహు తక్కువగా నిద్రిస్తారు. ఇంకా రాత్రి చివరి ఘడియల్లో పాపాల మన్నింపుకై (ఇస్తిగ్‌ఫార్) వేడుకోవడం చేస్తూ వుంటారు."
(అజ్ జారియాత్)

"వారి వీపులు పడకలకు దూరంగా వుంటాయి. తమ ప్రభువును భయంతోనూ, ఆశతోనూ వేడుకుంటారు." (అస్సజ్‌దహ్-16)

తాకీదు ఎంతగా చేయబడినప్పటికీ, ధర్మంలో కేవలం ప్రోత్సహించే హద్దు వరకూ తాకీదు చేయబడింది. ఈ విషయాన్ని మనం ప్రతి ఒక్కరి కోసమూ తప్పనిసరి కార్యంగా చెయ్యలేము. అందుచేత మనం సందేశ ప్రచారంలో, ధర్మపోరాటంలో నిమగ్నులయి వున్న ప్రతి వ్యక్తి నుండీ **'ఖియామె లైల్'** చేయమని కోరలేము. ఈనాటి బిజీ జీవితంలో బహు కొద్దిమంది మాత్రమే నిభాయించగల అదనపు కార్యం ఇది. కాని సర్వోన్నతుడయిన అల్లాహ్ తరఫునుండి ఇంత గొప్ప ప్రోత్సాహం లభించిన తర్వాత ఒకవేళ మీ హృదయం రాత్రి ఘడియల్లో మీ ప్రభువుతో సామీప్యం పొందగోరితే, లేవండి. అలా అయితే ఈ పని చేయడానికి సులభ మార్గాలు కూడా వున్నాయని మీరు తప్పక తెలుసుకోవాలి.

1) ఒకవేళ రాత్రి చివరి భాగంలో లేచి, నమాజ్ చేయడం కష్టమనిపిస్తే, పడుకునే ముందు ఎనిమిది రకాతులు నమాజ్ చేసుకోండి. ఒకవేళ పడుకునే ముందు నమాజ్ కోసం వుజూ చేయడం, నిలబడటం (నమాజ్‌లో) కూడ కష్టమనిపిస్తే ఇషా నమాజ్‌తోపాటు చేయండి. దైవప్రవక్త (సఅసం) రాత్రి మొదటి భాగంలోనే కాక ప్రతి భాగంలోనూ ఈ నమాజ్ చేశారనడానికి ఆధారాలు వున్నాయి. మీరు గనక ఒకసారి సంకల్పించుకొని ఒకసారి రాత్రి మొదటి భాగంలో చేయసాగితే ఇన్షా అల్లాహ్ (దైవచిత్తమయితే) అర్ధరాత్రి లేక రాత్రి చివరి భాగంలో చేసే భాగ్యమూ దక్కవచ్చు.

2) రాత్రి నమాజ్‌లో కూడా మీరు సుదీర్ఘ ఖిరాత్ మాత్రమే చేయడం తప్పనిసరి కాదు. చివరి పది సూరాలనే రాత్రి నమాజ్‌లో పఠించవచ్చు. లేక ఆఖరులోని చిన్న సూరాలు వేటినయినా పఠించినా సరిపోతుంది. **"సూరయె ఇఖ్‌లాస్ మూడవ వంతు ఖుర్ఆన్‌కు సమానము. సూరయె కాఫిరూన్ నాలుగవ వంతుకు, సూరయె నస్ర్ నాలుగవ వంతుకు, సూరయె జిల్‌జాల్ సగం వంతుకు,**

ఇంకా సూరయె తకాసూర్ వెయ్యి ఆయతులకు సమానం." (అని మహాప్రవక్త (సఅసం) సెలవిచ్చారు) చిన్న సూరాలు పరిమాణం రీత్యా చిన్నవైనప్పటికీ ప్రతిఫలం రీత్యా పెద్ద సూరాలకంటే ఏ మాత్రం తక్కువ కావు. దైవప్రవక్త (సఅసం) ఈ విషయం కూడా సెలవిచ్చారు. ఎవరయితే నమాజ్‌లో పది ఆయతులు చదివారో వారి పేరు ఏమరుపాటు వహించే వారి జాబితాలో వ్రాయబడదు. ఇంకా ఎవరయితే వంద ఆయతులు పఠించారో వారి పేరు రాత్రంతా దైవసన్నిధిలో గడిపిన వారి జాబితాలో చేర్చబడుతుంది. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఇలా చెప్పారు: **"ఇజా జుల్ జిలత్ మరియు అల్ ఖారిఅ సూరాలను ఆగి ఆగి, అర్థం చేసుకుని చదవండి, అలా అయితే అల్ బఖర, అలి ఇమ్రాన్ సూరాలను త్వరత్వరగా అర్థం చేసుకోకుండా పఠించడం కంటే ఉత్తమం అని నేను భావిస్తున్నాను."**

3) ఒకవేళ ఇది కూడా మీకు కష్టమనిపిస్తే ఫజర్ మరియు ఇషా నమాజులు, వీటిని మీరు ఎలాగైనా జమాఅత్‌తో చదవాల్సిందే, వీటిని దైవ ప్రవక్త (సఅసం) వినిపించిన శుభవార్తపై నమ్మకంతో జమాఅత్‌తో పాటు చేయండి. **"ఎవరయితే ఇషా నమాజు జమాఅత్‌తో చేస్తారో వారు సగం రాత్రి నమాజ్ చేసినట్లు, ఇంకా ఎవరయితే ఉదయం (ఫజ్ర్) నమాజు జమాఅత్‌తో చేస్తారో వారు పూర్తి రాత్రి నమాజ్ చేసినట్లే"** అని మహాప్రవక్త (సఅసం) సెలవిచ్చారు. అత్యంతగా పనులలో నిమగ్నుడయిన వ్యక్తి కోసం కూడా ఖియామె లైల్ పుణ్యాన్ని పొందే ఈ మార్గం ఎంత సులభమయింది! ఫజర్, ఇషా నమాజులను వ్యర్థపరచుకుని ఖియామె లైల్ ప్రతిఫలాన్ని కోల్పోయే వారు పరమ దౌర్భాగ్యులు. ప్రత్యేకించి ఫజర్ నమాజు- దాని గురించి హజ్రత్ ఉమర్ (రజి) సెలవిచ్చారు. **"నేను ఫజర్ నమాజ్ జమాఅత్‌తో చేస్తాను. ఇది నాకు రాత్రంతా నమాజ్ చేయడం కన్నా ఎంతో ప్రియమైనది."**

4) ఉపవాసం కోసం మీరు సహరీ వేళ మేల్కొంటే కొద్దిపాటి ప్రయత్నం వల్ల ఇది సులభ సాధ్యం కావచ్చు. మీరు కొన్ని నిమిషాలు ముందుగా లేవండి. ఉన్న సమయాన్ని బట్టి రెండు లేక నాలుగు రకాత్‌లు చదవండి. ఆ తర్వాత- మరింత నమాజ్ చేయలేకపోతే, నమాజ్ చేయకపోయినా -సజ్దాలో మీ నుదురు నేలకు ఆనించండి. అల్లాహ్ ఎదుట భయభక్తులతో కన్నీరు కార్చండి. ఆయనతో

మీ పాపాల మన్నింపుకై ప్రార్థించండి. ధార్మిక, ప్రాపంచిక కోరికల్ని, వరాల్ని ఆయన్ని అర్థించండి. హృదయ విదారకంగా మీ జాతి కోసం, ముస్లిం సమాజం కోసం, ప్రపంచ మానవాళి కోసం, హితబోధ కోసం శ్రేయస్సు కోసం ప్రార్థించండి. ఇంకా ఎవరినైతే మీరు దైవమార్గంలోకి నడిపించడం మీ బాధ్యతో లేక ఆ మార్గంలో మీ వెంట నడుస్తున్న సహచరులందరి కోసమైనా, వ్యక్తులు, వర్గాల పేరుపేరునా ప్రత్యేకించి వారందరి కోసం మీ మనస్సును కరిగించండి. ఈ విధంగా మీరు వేకువ వేళల్లో కన్నీరు కారుస్తూ వేడుకునే వారి సమూహంలో చేరిపోగలరు. రాత్రి ఆరాధనలో కన్నీటి వేడుకోలు యొక్క మాధుర్యాన్ని ఆస్వాదించండి. ప్రాణులతో మీ సంబంధంలో హృదయ విదారత, నిస్వార్థత జనిస్తుంది.

రమజాన్ మాసంలో ఈ మాత్రం చేయడం మీకు కష్టమేమీ కాదు. రమజాన్ తప్ప ఏ రాత్రి అయినా ఖియామె లైల్ చేసి ఆ తర్వాత ఈ అచరణ చేపట్టండి. అంతేకాక ఎప్పుడు సాధ్యపడితే అప్పుడు ఫజర్ కంటే కాస్త ముందు లేవండి. సజ్దాలో నుదురు నేలకు ఆనించి ఇదే ఆచరణ చేయండి. ఒకవేళ మీరు తహజ్జుద్ నమాజ్ చేయలేకపోయినా సరే. ఈ విధంగా చివరికి మీరు సక్రమంగా ప్రాతఃకాలాల్లో ఇస్తిగ్ఫార్ చేసే భాగ్యం అల్లాహ్ మీకు సద్బుద్ధి నివ్వడంలో ఆశ్చర్యమేముంది? ప్రాతఃకాలం అశ్రుధారలతో మీరు షైతాన్ కోసం ప్రమాదకరం కాగలరు.

3) నిత్య స్తోత్రం

అల్లాహ్ సాన్నిధ్యమే నమాజ్ లక్ష్యం. ఇదే ఆయన స్తోత్రం. కాని స్తోత్రంలో సాధించవలసిన స్థితి ఏమంటే, మీరు లేస్తూ, కూర్చుంటూ, పరుంటూ అల్లాహ్‌ను స్మరించాలి. **"యజ్‌కురూనల్లాహ ఖియామవ్ఁ వ ఖుఊదవ్ వ అలా జునూబిహిమ్"** (ఆలి ఇమ్రాన్: 191). ఈ స్థితిని సాధించడానికి మీరు జీవితంలోని ఏ మామూలు దిన చర్యనూ విడిచిపెట్ట నవసరం లేదు. **"లేస్తూ, కూర్చుంటూ, పరుంటూ"** అనే పదాలు వాటికవే ఈ వాస్తవికతను వ్యక్తం చేస్తున్నాయి. కేవలం శ్రద్ధ, సక్రమతలు అవసరం.

జీవితంలోని ప్రతి పనీ ఏ విధంగా చేస్తామో అలాగే చేస్తూ వుండాలి. కాని ఎప్పుడు ఎంతగా సాధ్యపడితే అంతగా తమ దృష్టిని అల్లాహ్ వైపు మరల్చే ప్రయత్నం చేయాలి.

"ఆయన నా వెంట వున్నాడు"- "ఆయన నన్ను చూస్తున్నాడు"- "ఆయన తినిపిస్తున్నాడు, త్రాపిస్తున్నాడు"-"ప్రతి వస్తువూ ఆయన అనుగ్రహించిందే"- "ఆయన నా ప్రతి మాటను వింటున్నాడు" "దేనిపై దృష్టి పడితే అది ఆయన సృష్టించినదే"- "ఒక రోజు అల్లాహ్‌ను కలుసుకోవాలి"- "ఈ వరం గురించి ఆయన ప్రశ్నిస్తాడు"- "ఈ పనిలో ఆయన కోరినందు వల్లే ఆయన ఆజ్ఞ, ఉపాయం వల్లనే విజయం కలుగుతుంది"- ఇంకా ఇటువంటి ఇతర స్మృతులు. ఈ విధంగా అల్లాహ్‌ను స్మరించడానికి సమయం అక్కర లేదు. కేవలం శ్రద్ధ కావాలి.

ఇక ఎప్పుడు వీలయినా తమ మనస్సు మననానికి అక్షర రూపం కూడా ఇవ్వాలి. ఉదాహరణకు ఏదయినా పని ఆరంభిస్తే (బిస్మిల్లాహ్) అల్లాహ్ పేరు స్మరించాలి. ఏదయినా అనుగ్రహం వల్ల లబ్ది పొందితే కృతజ్ఞత చెల్లించాలి (అల్ హమ్దులిల్లాహ్). ఏదయినా పాపం జరిగిపోతే ఆ భావన మెదలగానే అస్తగఫార్ చెయ్యాలి (రబ్బిగ్ ఫిర్లీ). దైవప్రవక్త (స) గురించిన ఆలోచన గాని పేరుగాని వస్తే దరూద్, సలాం పఠించాలి. దైవప్రవక్త (స) జీవితంలోని ప్రతి పనికి అజ్‌కార్ మరియు దుఆలను నేర్పింది ఇందుకోసమే. పనీ జరిగి పోతుండాలి, ఆ పనుల్లోనే అల్లాహ్‌ను నిరంతరం గుర్తు చేసుకుంటూ వుండాలి. మీరు అజ్‌కార్, దుఆలను అరబీ భాషలోనే గుర్తు చేయవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. వాటి భావాన్ని నోటిలో, నోటితో ఉచ్ఛరించాలి. లేక మనస్సులో కూడా చెప్పుకుంటే సరిపోతుంది. పూర్తిగా ప్రయత్నించినప్పటికీ మీరు ఇదంతా చేయడం మాటిమాటికీ మర్చిపోతారు. దృష్టి మరలిపోతుంది. సక్రమ కొనసాగింపు జరగదు. అయినప్పటికీ ఆందోళన చెందవలసిన పనిలేదు. తప్పులు చేయడం మానవ సహజం. ఇదంతా చేయడం మర్చిపోయారని మీకు గుర్తుకు రాగానే, మామూలుకు భిన్నంగా జరిగితే మరోసారి అల్లాహ్‌వైపు దృష్టి నిలపడం, గుర్తు చేసుకోవడం ఆరంభించండి. ఈ విధంగా మీరు పలుమార్లు

మర్చిపోవడం, పలుమార్లు దైవ ధ్యానం వైపు మరలడం జరిగితే మీ కోసం స్వర్గ శుభవార్త ఇవ్వబడిన తౌబా చేసుకునే వాని స్థానం పొందే ద్వారం తెరుచుకుంటుంది. (సూరయె ఖాఫ్)

మీరు ఈ పద్ధతిలో స్మరణ చేసుకోవడం ప్రారంభిస్తే ఈ విధంగా మెల్ల మెల్లగా మీకు ఉదయం-సాయంత్రం స్మరణ, తరచూ స్మరణ లేస్తూ కూర్చుంటూ, పడుకుంటూ స్మరణ చేసే భాగ్యం లభిస్తుంది.

4) స్మరణ కోసం నిర్ణీత వజీఫా (స్తోత్రక్రమం)

అన్ని వేళలా మనస్సులో, నోటితో స్మరణ, వివిధ సమయాల్లో ఉదాహరణకు నమాజ్ తర్వాత ఉదయం సాయంత్రం వివిధ రకాల పనులు చేస్తూ, ప్రత్యేక అజ్కార్‌లతో పాటు, ఒకవేళ మీకు సాధ్యపడితే అజ్కార్‌లతో కూడిన ఒక ముక్తసరి క్రమాన్ని పాటించేందుకు ప్రయత్నం చేయండి. ఈ క్రింద ఒక సిలబస్ ఇవ్వబడుతోంది. దానికి పది నిమిషాలకన్నా ఎక్కువ సమయం పట్టదు. వీటిలోని ప్రతి జిక్ర్ గురించిన శిక్షణ, తాకీదు, ప్రతిఫలం, శుభాల గురించి ప్రామాణికమైన హదీసులలో వివరించబడింది. ఫజర్ మరియు మగ్రిబ్ నమాజ్‌ల తర్వాత ఈ వజీఫా చేయండి. మగ్రిబ్ తర్వాత కష్టం అయితే ఫజర్ వేళలోనే చేసుకోండి. నమాజ్ అయిన వెంటనే కష్టమనిపిస్తే నమాజ్‌కు ముందుగా లేక తర్వాత చేసుకోండి. కాని మొదటి మరియు ఆఖరి జిక్ర్‌లను ఫజర్ మరియు మగ్రిబ్ నమాజ్‌ల వెంటనే చేయ ప్రయత్నించండి.

1) **"లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లా షరీకలహు లహుల్ ముల్కు వ లహుల్ హమ్దు యుహ్‌యీ వ యుమీతు బి యదిహిల్ ఖైర్ వహువ అలా కుల్లి షయ్ఇన్ ఖదీర్" - 10 సార్లు.**

2) **"సుబ్‌హానల్లాహి వల్ హమ్దులిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. వలా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అలియ్యిల్ అజీమ్." -10సార్లు**

3) **"సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ, సుబ్‌హానల్లాహిల్ అజీమ్"-10 సార్లు**

4) **"అల్లాహుమ్మ సల్లి వ సల్లిమ్ అలా అబ్దిక వ రసూలిక వహబీబిక సయ్యిదినా ముహమ్మదిన్నబియ్యిల్ ఉమ్మియ్యి వ అలా ఆలీహీ వ అస్హాబిహీ వ బారిక్ వ సల్లిమ్"- 10 సార్లు**

5) **"రబ్బిఘ్ ఫిర్ వర్హమ్ వఅన్‌త ఖైరుర్రాహిమీన్"- 10 సార్లు**

6) **"అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్"- 7 సార్లు**

5) మరణాన్ని స్మరించటం

మరణం, మరణించిన తర్వాత అల్లాహ్‌ను కలుసుకునే రోజును కూడా దివ్యఖుర్ఆన్ అత్యధికంగా గుర్తు చేయిస్తుంది. గుర్తుంచుకోవాల్సిందిగా తాకీదు చేస్తుంది. ఈ పని కూడా లేస్తూ, కూర్చుంటూ, పడుకుంటూ చేయాలి. కాని కొన్ని క్షణాలు నిశ్చలంగా మరణాన్ని, మరణం తర్వాత అల్లాహ్‌ను కలుసుకునే వరకు గల ప్రయాణాన్ని గుర్తుంచుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం ఉదయం, సాయంత్రం వజీఫాలలోని ఆఖరి దుఆలు శ్రేష్టమయినవి.

దైవప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు, **"మగ్రిబ్ మరియు ఫజర్ నమాజ్‌ల తర్వాత ఏడుసార్లు ఈ దుఆ (అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్) చేసిన వ్యక్తిని అల్లాహ్ అగ్ని శిక్ష నుండి కాపాడుతాడు."** దుఆ తనంతట తానే పని చేయదు. దుఆ అంటే మీకు కావలసిన దాని గురించి, మీకు తృష్ణ వున్న దాని గురించి, మీ కోరికను వెల్లడించడం. మీరు, నీరు అడుగుతున్నారు- అంటే మీకు దాహం వేసి వుండాలి, అన్నం అడుగుతున్నారు అంటే- ఆకలి వేసివుండాలి. ఆకలి దప్పులు ఎంత తీవ్రంగా వుంటే అంతే అసహనంతో మీరు అన్నమూ నీరూ కోరుతారు. ఇదే విధంగా మీ మనస్సుకు నరకాగ్ని నుండి రక్షణ పొందాలన్న ఆలోచన తీవ్రంగా వుండి వుంటే మనసులో భయం, అనుమానం, అసహనం, వ్యాకులతలు ఆవరించి ఉంటాయి. అప్పుడు మీరు **"అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్"** అని అంటే ఆ పదాల ప్రభావం వుంటుంది. మనసులో అగ్ని రగుల్కొంటే మాటలు మనసు నుండి వెలువడతాయి. ప్రభావం చూపుతాయి. మీరు మనసుతో పలికితే, మనసుకు అగ్ని నుండి రక్షణ పొందాలన్న ఆలోచన కలుగుతుంది.

ఈ దుఆలను ఒక ప్రత్యేక పద్ధతిలో చదివినందువల్ల అది ఉదయం, సాయంత్రం తన ప్రభువుతో కలయికను గుర్తుంచుకునే ప్రభావ పూరిత సాధనం కాగలదు. ఈ పద్ధతిలో అంతగా సమయం పట్టదు. దివ్యఖుర్‌ఆన్‌లో పరలోక ప్రయాణం గురించి వివరంగా చర్చించబడింది. నేను ప్రతిసారీ ఈ ప్రయాణం లోని ఏదో ఒక దశ యొక్క రూపాన్ని మనసులో గుర్తు చేసుకుని **"అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్"** అంటాను. ఈ విధంగా పూర్తి ప్రయాణం కళ్ళముందు మెదలుతుంది.

ఈ పద్ధతి ఏమిటి? మీరు మొదటి దఫా అంటే మరణ సమయాన్ని గుర్తు చేసుకోవాలి. దివ్యఖుర్‌ఆన్‌లో మరణ సమయం గురించి అనేక పర్యాయాలు ప్రస్తావించబడింది. ఏదో ఒక దృశ్యాన్ని మీ మస్తిష్కంలో నిలుపుకోండి. ఒక దృశ్యం ఇది:

"ప్రాణం గొంతులోకి వచ్చినప్పుడు, మంత్రించి ఊదే వారెవరైనా ఉన్నారా అని అనబడినప్పుడు, ఇది ప్రపంచం నుండి వేరైపోయే సమయమని మనిషి తెలుసుకుంటాడు. ఒక కాలుతో మరొక కాలు కలిసిపోయినప్పుడు, అది నీ ప్రభువు వైపునకు తరలిపోయే రోజు అవుతుంది." (అల్ ఖియామహ్- 75:26-30) లేక ఆ సమయాన్ని గుర్తు చేసుకోండి. దూతలు వచ్చి ముఖాలపై, కండరాలపై అగ్ని కొరడాలతో కొట్టినప్పుడు - లేక మరే దయినా మరణ దృశ్యాన్ని కొన్ని సెకండ్లపాటు ఏదయినా ఖుర్‌ఆన్ భాగం ద్వారా మస్తిష్కంలోకి తెచ్చుకుని మీరు మరణ సమయాన్ని గుర్తు చేసుకోండి. మొదటిసారి **అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్** అని పలకండి.

రెండవసారి చెప్పసాగితే సమాధి దశను గుర్తు చేసుకోండి. మరణం తర్వాతి మజిలీ సమాధి. ఇక ముందు ఏమి జరగనున్నదో సమాధి నిర్ణయిస్తుందని చెప్పబడింది. **'సమాధి అగ్ని గుండాలలో ఒక గుండం. లేదా స్వర్గవనాలలోని ఒక వనం.'** హజ్రత్ ఉస్మాన్ (రజి) సమాధి దగ్గర నిలబడినప్పుడు కన్నీరు మున్నీరుగా విలపించేవారు. ఆయన గడ్డం కన్నీటితో తడిసి పోయేది. సమాధి ఇలా అంటుంది అని దైవప్రవక్త (సఅసం) చెప్పారు: **"నేను ఏకాంత గృహాన్ని. నేను కీటకాల గూడుని"** సమాధి దృశ్యాలలో ఒక దాన్ని మనస్సులో గుర్తు చేసుకోండి. **అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్** అని పలకండి.

మూడవ దశను గుర్తు చేసుకోండి. మిమ్మల్ని సమాధుల నుండి లేపి అల్లాహ్ ఎదుట నిలబెట్టడం జరుగుతుంది. ప్రజలు ఎడాపెడా లేచి పరుగులు తీస్తారు. నిశ్చేష్టులయి వుండిపోతారు. చూపులు పైకెత్తలేక పోతారు. ముఖాలు అవమానంతో మాడిపోయి వుంటాయి. దిగంబరులయి వుంటారు. కాని చూసుకునే స్పృహ వుండదు. సూర్యుడు అతి సమీపానికి వచ్చేస్తాడు. చెమట ఎంతగా ప్రవహిస్తుందంటే ప్రజలు చెవుల వరకూ మునిగిపోయి వుంటారు. అతి స్వల్పమయిన శిక్ష ఏమంటే మనిషికి. అగ్నితో చేయబడిన పాదరక్షలు తొడిగించబడతాయి. అతడి మెదడు కరుగుతూ వుంటుంది. కర్మల పత్రాలు చేతుల్లో వుంటాయి. అందరూ దైవసమక్షంలో నిలబడి వుంటారు. శాశ్వతంగా అదృష్టాలు నిర్ణయించబడటం జరుగుతూ వుంటుంది. సత్కర్మలు బరువుగా వున్నవారు మనసుకు నచ్చిన జీవితం పొందుతారు. దుష్కర్మలు బరువుగా వున్నవారి నివాసం అగ్ని గుండం అవుతుంది.

ఇది పర్యవసానపు మజిలీ. ఏదో ఒక దృశ్యాన్ని మనసులో తాజా చేసుకోండి. మూడవసారి అనండి. **అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్.**

నాలుగవ మజిలీ పుల్ సిరాత్ (వంతెన). మీరు ఆలోచించండి. నేను నరకం పైనుండి ముందుకు సాగుతాను. ప్రతి మనిషీ అక్కడ తప్పక వస్తాడు. దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు, **"కొందరు వాయువేగంతో దాటిపోతారు. కొందరు తడబడుతూ దాటిపోతారు. మరికొందరు అక్కడే పడిపోతారు."** అప్పుడు కర్మలే వాహనాలు అవుతాయి. మరే వాహనమూ వుండదు. మీరు ఈ దృశ్యాన్ని ఊహించుకోండి. నాలుగోసారి అనండి. **అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్.**

ఇంకా అక్కడ మరో శిక్ష వుంది. ఇది అవమానం నిరాశల శిక్ష. ఇది మానసిక పరమయిన శిక్ష. ఆరవసారి దాన్ని ఊహించండి. ఇది హషర్ నుండి ఆరంభమవుతుంది. ఉదాహరణకు అక్కడ మీ కర్మలన్నీ బ్రాడ్‌కాస్ట్ చేయబడి నప్పుడు **(వ ఇజస్సుహుఫు నుషిరత్)** ఆ ఘడియను మీరు ఎదుర్కోగలరా?

నన్ను నేనూ ఎరుగుదును. అతడి కర్మలన్నీ లౌడ్ స్పీకర్‌లో ప్రకటించబడటం ఆరంభమయి పోవడం అనే ఈ అవమానాన్ని ఎవరు కొని తెచ్చుకోగలరు? ఎంత పరాభవం, ఎంత అవమానం మన భాగంలోకి రాగలుగుతుంది? ఇంకా అక్కడ మన ఆయుర్దాయం ఇంత ముక్తసరిగా వుండగా మనం దాన్ని ఎందుకు వ్యర్థం చేసుకున్నామా అన్న అత్యంత గొప్ప పశ్చాత్తాపం, నిరాశ చెందుతాము. ఇంకా నరకాన్నుండి బయటికి రావాలనుకుంటే విముక్తికి మార్గమేదీ కనబడదు. ఎవరినయితే పరిహసిస్తూ ఉండేవారమో వారినే అక్కడ భోగభాగ్యాలలో వుండగా చూస్తాము. మీరు పరాభవం, అవమానం, నిరాశల ఈ శిక్షను గుర్తు చేసుకోండి. ఇక ఆరవ సారి అనండి. **అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్.**

ఇక చివరగా ఏడవసారి మీరు ఆలోచించండి. రేపు ఏదయితే ఎదురు కానుందో అదంతా నేటి సంపాదనే. రేపు ఎన్ని దశలయితే ఉన్నాయో అవన్నీ సులభం అయ్యేది నేటి కర్మల వల్లనే. అసలు విషయమేమంటే రేపు అగ్నిగా మారగల కర్మల నుండి నేడు నన్ను అల్లాహ్ కాపాడాలి. తిరిగి ఏడవసారి అనండి. **అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్.**

ఈ విధంగా మీరు ప్రపంచం నుండి బయలుదేరి మరణ సమయం నుండి నరకం వరకూ తిరిగి వెనక్కి మరలి నేటి ప్రపంచంలోకి వచ్చేయండి. ఈ ప్రయాణం సమాప్తం అవుతుంది.

నిశ్చలంగా మరణం తర్వాత అల్లాహ్‌తో కలుసుకోవడాన్ని గుర్తుంచు కోవడానికి ఐదుపూటల నమాజ్, ఇంకా (పై తెలిపిన పద్ధతి ప్రకారం) "అల్లాహుమ్మ అజిర్నీ మినన్నార్" దుఆ మాత్రమేకాక వుజూ కూడ ఎంతో సహాయకారి కాగలదు. వుజూ చేస్తూ గనక కొన్ని దుఆలు చదవబడితే, నోటితో కాకపోయినా మనసులోనయినా సరే– ఇమామ్ గజాలీ (రహ్మాలై) 'అహ్యావుల్ ఉలూమ్'లోనూ, షేఖ్ అబ్దుల్ ఖాదర్ జీలానీ (రహ్మాలై), 'గునియతు త్తాలిబీన్'లోనూ వీటి గురించి బోధించారు.

నీరు పుక్కిలించే సమయంలో:

"నా ప్రభూ! నీ గ్రంథాన్ని పఠించడంలో, నిన్ను అమితంగా గుర్తుంచు కోవడంలోనూ నాకు సహాయం చెయ్యి."

ముక్కులో నీరు పోనిచ్చేటప్పుడు:

"నా ప్రభూ! నరక దుర్వాసన నుండి నీ రక్షణ కోరుతున్నాను. నాకు స్వర్గ సువాసన ప్రసాదించు."

ముఖం కడిగేటప్పుడు:

"నా ప్రభూ! ముఖాలు వెలిగిపోయే రోజున నా ముఖాన్ని నీ వెలుగుతో ప్రకాశింపచెయ్యి, ముఖాలు నల్లబడే రోజున నా ముఖాన్ని నల్లబడనీయకు."

చేతులు కడిగేటప్పుడు:

"నా ప్రభూ! నా కర్మల పత్రాన్ని నా కుడి చేతికి ఇవ్వు. నా లెక్క సులభం చెయ్యి."

"నా ప్రభూ! నా కర్మల పత్రాన్ని నా ఎడమ చేతికి ఇవ్వకు."

తలను మసహ్ చేసేటప్పుడు:

"నా ప్రభూ! నీ నీడ తప్ప మరో నీడ ఉండని రోజున నాకు నీ పీఠం క్రింద నీడను ఇవ్వు."

కాళ్ళు కడిగేటప్పుడు:

"నా ప్రభూ! పాదాలు జారిపోయే రోజున నా పాదాలను కలిపి వుంచు."

6. ఖుర్ఆన్ అవగాహన

దివ్యఖుర్ఆన్‌ను ఆగి ఆగి పఠించడం, ఖియామె లైల్ ముఖ్య ఉద్దేశ్యాలలో గొప్ప ఉద్దేశ్యం. తద్వారా దాని ఆయతులు మనోమస్తిష్కాలలో ఆత్మలో జీర్ణించుకుపోవాలి. సుదీర్ఘంగా నిలబడలేకపోవడం, ఖుర్ఆన్ గుర్తుండక పోవడం, అరబీ భాష తెలియక పోవడం వల్ల తరచుగా ప్రజలకు ఈ లక్ష్య సాధన సాధ్యం కాదు. కాని ఇప్పుడు ప్రతి ఒక్కరి దగ్గర అనువాదంతో అచ్చయిన ఖుర్ఆన్ ప్రతులు వుంటున్నాయి. సంకల్పంతో దీక్షగా కాస్తంత ఎక్కువ సమయం వెచ్చించి ఖుర్ఆన్ నుండి ఎంతో కొంత ప్రయోజనం తప్పక పొందవచ్చు.

ఈనాటి నుండే మీరు నిర్ణయించుకుని ప్రతి రోజూ ఖుర్‌ఆన్‌లోని కొన్ని ఆయతులు- 3 నుండి 10 వరకు, సాధ్యమయినంత వరకు - తర్జుమాతో సహా పఠించండి. ప్రతిపదార్థం కూడా చదవండి. నుడికారంతో కూడా, ఇంకా ఇది ఎవరి వాణి అయితే అయివుందో ఆయన ఎదుట మీరు ఉన్నారన్న భావనతో చదవండి. ఇంకా ఒకసారి ఇది కూడా ఆలోచించుకోండి. ఈ ఆయతులలో నేను గుర్తుంచుకోవలసిన, గుర్తు చేసుకోవలసిన విషయం ఏదయినా వుందా అని చూసుకోండి. మీరు రోజు మూడు ఆయతులయినా చదివితే దాదాపు ఆరు సంవత్సరాలలో ఖుర్‌ఆన్ పూర్తి అవుతుంది. ఇటువంటి ఆరేళ్ళు, ఎంతకాలంగా మీరు గడిపివేశారో కదా! పది ఆయతులు రోజూ చదివితే రెండు సంవత్సరాలలో పూర్తి అవుతుంది. కాని మీరు ఎంత సులువుగా, క్రమబద్ధంగా ఎంత చదవగలుగుతారో అంతే చదవండి. అనవసరంగా అధిక భారం వహించకండి.

తౌహీద్ సారం

జీవితంలోని ప్రతి పనిలో, ప్రత్యేకించి సందేశం, ధర్మపోరాటానికి సంబంధించిన ప్రతి పనిలో ఈ విషయాన్ని గుర్తుంచుకోవడం వల్లనే అల్లాహ్‌తో సంబంధాన్ని తౌహీద్ అసలు మూలాన్ని మీరు పొందగలరు. అదేమంటే వెచ్చింపు, ఉపాయశీలతల అధికారం అల్లాహ్‌కు, కేవలం అల్లాహ్‌కు మాత్రమే వుంది. మాషా అల్లాహ్ వలాఖువ్వత్ ఇల్లాబిల్లాహ్ లాహౌల వలా ఖువ్వత ఇల్లాబిల్లాహ్. ప్రణాళికలన్నీ మీరు రూపొందించండి. అన్ని ఉపాయాలనూ అవలంబించండి. కాని నా ఉపాయం చేత వాటి సంఖ్య చేత లేక భౌతిక పరమయిన కారణాల వల్ల ఏమయినా అవుతుందని, నా పని ఏదయినా నెరవేరుతుందని, ఎవరయినా సందేశాన్ని స్వీకరిస్తారని ప్రజలు సమీకరించ బడతారని, ఏదయినా సాఫల్యం ప్రాప్తిస్తుందని ఎంత మాత్రం భావించకండి. ఇంకా ఏదయినా కార్యం నెరవేరితే, ఇది నేను చేశానని, నా ఉపాయశీలత వల్లనే జరిగిందని ఎంతమాత్రం తలపోయకండి. **"ఫలమ్ తఖ్‌తులూహుమ్ వలా కిన్నల్లాహ ఖతలహుమ్ వమా రమైత ఇజ్ రమైత వలా కిన్నల్లాహ రమా...."**

(అన్‌ఫాల్-8:17)

(వాస్తవమేమిటంటే నీవు వధించలేదు. అల్లాహ్‌యే వారిని వధించాడు. మరియు ఓ ప్రవక్తా! నీవు విసరలేదు. అల్లాహ్ విసిరాడు) అన్న విషయాన్ని గుర్తుంచుకోండి.

తౌహీద్, తవక్కల్ (భరోసా) యొక్క సారం మీరు ప్రయత్నాలు చేయకూడదన్నది ఎంత మాత్రం కాదు. ఉత్తమ పథకం రూపొందించడం అయితే మీపై అల్లాహ్‌కు గల హక్కు. తౌహీద్ తవక్కల్ ఏదంటే, ఏదయినా భౌతిక పథకం లేదా కారణానికి ప్రభువు స్థానాన్ని ఇవ్వకండి. ఏదయినా శక్తి, అధికారం లేక ఫలితం, ఉపాయం లేదా కారణంలో దాగి వున్నాయని భావించకండి. అందుకోసం ఏ పని చేసినా అందులో సాఫల్యం కోసం దుఆ తప్పక చేయండి. ఇంకా ఏ పని అయినా నెరవేరితే అందుకు తమ ప్రయత్నాలపై గొప్పలు చెప్పుకునే బదులు అల్లాహ్‌కు కృతజ్ఞత చెల్లించండి. ఇది కూడ దైవస్మరణయే. ఎంతో గొప్పదైన దైవనామ స్మరణ.

వెలుగు నిచ్చే రెండు మినార్లు

అల్లాహ్‌తో ఎటువంటి సంబంధం మీకు అవసరమో అందుకోసం రెండు దుఆల (సారాంశాన్ని)ను గుర్తుంచుకోండి. వాటిని కోరుతూ (ప్రార్థిస్తూ) వుండటం వలన మీరు దైవసామీప్యతను పొందగలరు.

1) అల్లాహుమ్మ తహ్హిర్ ఖల్బీ మినన్నిఫాఖి, వ అమలీ మినర్రియాఇ, వలిసానీ మినల్ కిజ్‌బి వ ఐనీ మినల్ ఖియానతి, ఇన్నక తఅలము ఖాఇనతల్ అయుని వమా తుఖ్ఫిస్సుదూర్.

నా ప్రభూ! నా హృదయాన్ని కాపట్యాన్నుండి పవిత్రం చెయ్యి, (ద్వంద వైఖరి లేకుండా), నా కర్మలను ప్రదర్శనా బుద్ధి నుండి (ఏది చేసినా కేవలం నీ కోసమే చేసేటట్లు), నా నోటిని అసత్యాన్నుండి నా దృష్టిని ద్రోహం నుండి, (నీ ప్రసన్నత, అనుగ్రహ కారకం నుండి దారితప్పి మరే ఇతర అవసరాలు ప్రియతమాలపై కేంద్రీకరించకుండా) పవిత్రవంతం చెయ్యి. నిస్సందేహంగా నీవు చూపుల దోషాన్ని, మనస్సులలో దాగి వున్న విషయాల్ని ఎరిగిన వాడవు.

2) అల్లాహుమ్మజ్అల్నీ లక జక్కారన్, లక షక్కారన్, లక రహ్హాబన్, లక మిత్వాఅన్, లక ముఖ్బితన్ ఇలైక అవ్వాహమ్మునీబా.

ఓ ప్రభూ! నిన్ను అమితంగా గుర్తుంచుకునే, గుర్తు చేసుకునే వానిగా చెయ్యి. నీకు అపారమైన కృతజ్ఞతలు చెల్లించే వానిగా, నీకు అమితంగా భయపడుతూ వుండే వానిగా (ఇంకా ఉత్సాహంతో నిన్ను సంతృప్తపరచడానికి), నీవు విధిగా చేయని పనులను కూడా చేసేవానిగా (ఇవన్నీ చేస్తూ) నా మనస్సు నీపై లగ్నం అయివుండేటట్లు, (ఇదంతా చేసిన తర్వాత కూడా తప్పు చేశానేమో అన్న పశ్చాత్తాపంలో మునిగిపోయి) మాటిమాటికీ నిట్టూర్పు విడుస్తూ నీవైపునకు మరలుతూ ఉండేవానిగా చెయ్యి.

చివరి మాట

మీరు ఎంతగా పనుల్లో తలమునకలై ఉన్నప్పటికీ, మీ జ్ఞానం ఎంత అల్పమైనదయినప్పటికీ దైవసాన్నిధ్యం పొందటానికి పైన తెలిపిన సులభమైన ఆచరణా పద్ధతులను పాటించడం మీకు అసాధ్యం కావటం బహు అరుదు. కావలసిందల్లా జనసామాన్యానికి సందేశం యివ్వడం, ప్రజాసంస్కరణా కార్యం మీ యొక్క విధి అనీ, దైవ సాన్నిధ్యానికి తప్పనిసరి అన్న భావన మీలో కలగాలి. ఈ పని మహోన్నతమైనదీ, ప్రమాదాలతో కూడుకున్నదీను. ఈ మహోన్నతమైన, ప్రమాదాలతో కూడు కున్న పనిని మీరు నిర్వర్తించాల్సి వుంది.

ఇందుకోసం నిరంతర దైవధ్యానం, ఆయన సన్నిధి, ఆయన సమక్షంలో నిలబడటం, అభ్యర్థించడం వేడుకోవటం మరీ తప్పనిసరి. దీని కోసం ఐదు పూటల నమాజ్‌తో పూర్తిగా లబ్ధిపొందడానికి కృషి చేయాలి. ఇంకా అదనపు సమయం, శ్రమ లేని సులభమైన ఇతర కార్యాలలో నిమగ్నమై ఉండడానికి ప్రయత్నించాలి. ఇదే అన్నింటికన్నా సులభమైన, ప్రయోజనకరమైన సూత్రం. ఈ విధంగా మీలో చిత్తశుద్ధి, దైవప్రసన్నతను కోరేగుణం జనించవచ్చు. మీరూ ఏకాగ్రచిత్తులు కాగలరు.

స్తోత్రాల విషయంలో ప్రవక్త (సఅసం) హదీసులు

1) మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: ఎవరైతే ఈ వచనాలు **(లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లా షరీకలహు లహుల్ ముల్కు వ లహుల్ హమ్దు యుహీ వ యుమీతు బి యదిహిల్ ఖైర్ వహువ అలా కుల్లి షయ్యిన్ కదీర్)** పదిసార్లు పలుకుతారో వారికోసం బనీ ఇస్మాయీల్ నుండి నలుగురు

బానిసలకు స్వేచ్ఛ కల్పించిన దానికి సమానమయిన పుణ్యం లభిస్తుంది. (బుఖారీ, ముస్లిం, తిర్మిజీ, నసాయి గ్రంథాలలో అబీ అయ్యూబ్ అన్సారీ (రజి)గారి ఉల్లేఖనం) మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: ఉదయం మరియు మగ్రిబ్ నమాజుల తర్వాత ఖాయిదాలో కూర్చుని ఇతరులతో మాట్లాడే ముందు పదిసార్లు చదవాలి. (తిర్మిజీ, అన్అబీ అమామ)

2) మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: ఈ నాలుగు వచనాలు (సుబ్హానల్లాహ్... అల్లాహు అక్బర్) అల్లాహ్‌కు అత్యంత ప్రియతమమైనవి. వీటిలో నుండి దేనితో నయినా ఆరంభించండి. ఎటువంటి నష్టమూ లేదు. (ముస్లిం, తిర్మిజీ, అహ్మద్ బిన్ సమూరహ్ బిన్ జున్దుబ్) మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు. ఈ నాలుగు వచనాలను పలకటం, అల్లాహ్‌కు ప్రపంచంలోని ప్రతి వస్తువుకన్నా ఎక్కువ ప్రియకరం (ముస్లిం, తిర్మిజీ, నసాయి, అన్ అబీ హురైరా (రజి)) (ఇవే వచనాలు, సలాతె తస్బీహ్‌లో చదివే శిక్షణను ఆయన (స) తన బాబాయి హజ్రత్ అబ్బాస్‌కు ఇచ్చారు.)

(అబూదావూద్, ఇబ్ను మాజా, హాకిమ్ అన్ అబీ రాఫె)

3) మహాప్రవక్త (సఅస) ఇలా సెలవిచ్చారు, “సుబ్హానల్లాహ్, అల్‌హమ్దు లిల్లాహ్” భూమ్యాకాశాల మధ్య సమస్తాన్ని నింపివేస్తాయి. ఇంకా అల్ హమ్దు లిల్లాహ్ మీజాన్‌ను నింపివేస్తుంది. (ముస్లిం, అన్ అబీ మాలిక్ అల్ అష్ అరీ)

4) మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: “లా ఇలాహ ఇల్లల్లాహ్” అన్నింటికన్నా ఉత్తమమైన జిక్ర్. (తిర్మిజీ, అన్ జాబిర్)

5) మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: “లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్” స్వర్గంలోని ఖజానాలలో ఒక ఖజానా.

(సహీసిత్తా అన్ అబీ మూసా అల్ అష్ అరీ)

6) మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: “అస్తగ్‌ఫార్ చేస్తూ వుండే వ్యక్తికి అల్లాహ్ ప్రతి ఇబ్బంది నుండి తప్పించుకునే మార్గం చూపుతాడు. అతడికి అన్ని రకాల బాధల నుండి విముక్తి కలిగిస్తాడు. అతడికి ఊహించని చోటునుండి ఉపాధి ప్రసాదిస్తాడు.” (అబూదావూద్, ఇబ్ను మాజా, అన్ ఇబ్నె అబ్బాస్)